క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని జిల్లా కోర్టు ఆవరణలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనానికి రావాలంటూ బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాస్‌కు ఆహ్వానపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో ఆయన చాంబర్‌లో కలిసి పలు విషయాలను బార్ సభ్యులు వివరించారు. కె.గోపికృష్ణ, బాగం మాధవరావు, ఉప్పు ఆరుణ్, కుమార్ ఉన్నారు.

బతుకమ్మ, ఫ్యామిలీ డే సందర్భంగా ఆటలపోటీలు

సింగరేణి(కొత్తగూడెం): బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకల సందర్భంగా బుదవారం కొత్తగూడెం ఏరియాలోని సేవా సభ్యులు (రామవరం, రుద్రం పూర్, ధన్‌బాద్, గౌతంపూర్) లేడీస్ క్లబ్ సభ్యులకు ఆటలపోటీలను సేవా అధ్యక్షురాలు మధురవాణి నిర్వహించారు. మాట్లాడుతూ విజేతలకు 27న ప్రగతివనంలో నిర్వహించే వేడుకలలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. పద్మజా కోటిరెడ్డి, లేడీస్ క్లబ్ సెక్రటరీ సునీతా మురళి, సేవా సెక్రటరీ అనిత, లేడీస్‌క్లబ్, సేవా సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నిక

జూలూరుపాడు: విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా పాపకొల్లు గ్రామానికి చెందిన పూసాల శ్రీనివాసాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిప్పర్తి శివ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కాకర్లకు చెందిన చంద్రగిరి రమేష్, ప్రధాన కార్యదర్శిగా పాపకొల్లుకు చెందిన వురిమెళ్ల రాము, కోశాధికారిగా వెంగన్నపాలెంకు చెందిన కాసర్ల మంగయ్యాచారి, సహాయ కార్యదర్శిగా గుండ్లరేవుకు చెందిన బాణాల పుల్లాచారి, ప్రచార కార్యదర్శులుగా తంగెళ్లపల్లి కిషోర్, కాసర్ల నరసింహాచారి, మహిళా కార్యదర్శులుగా కాసర్ల పావని, సున్నం నాగమణి, విజయ నిర్మల, అనూష ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మహదేవ వెంకటేశ్వర్లు, సున్నం పిచ్చాచారి, కాసర్ల వీరాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు పీఎల్‌ఆర్ బోనస్‌పై సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా పరిధిలోని బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతీ సంవత్సరం చెల్లించే ఫెర్ఫామెన్స్ లింక్‌డ్ రివార్డ్ (పీఎల్‌ఆర్) దీపావళి బోనస్‌పై ఈనెల 25న కోల్‌కతాలో జేబీసీసీఐ – 6వ సమావేశం జరుగనుందని కోలిండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో చర్చలు సఫలమైతే దసరా లోపు కోలిండియాలో సింగరేణి మినహా ఇతర బొగ్గు పరిశ్రమలకు ఈ బోనస్ చెల్లించటం అనవాయితీ. అదేవిధంగా సింగరేణి కార్మికులకు మాత్రం దీపావళి ముందు ఈ బోనస్ చెల్లిస్తారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు ప్రతినిధులుగా కాకుండా ఇండియన్ నేషనల్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధిగా పాల్గొంటుంది.

జనరల్ అసిస్టెంట్లుగా బదిలీ వర్కర్లు

సింగరేణి(కొత్తగూడెం): 1258 మంది బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ చేస్తూ సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరి, భూగర్భ గనుల్లో 190, సర్ఫేస్ విభాగాల్లో 240 మస్టర్లు 2024 డిసెంబర్ 31 నాటికి పూర్తిచేసిన వారిని జనరల్ అసిస్టెంట్ క్యాటగిరి–1గా క్రమబద్ధీకరణ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) నాయకులతో సింగరేణి సీఎండీ, డైరెక్టర్(పా)తో జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే సింగరేణి వ్యాప్తంగా 1258 మంది ఈ అవకాశం రానుంది.

26న ధర్నాను విజయవంతం చేయండి

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రకటించిన లాభాల బోనస్ రూ.5500 నిరసిస్తూ ఈనెల 26న కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి పెద్దబోయిన సతీష్ తెలిపారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం సింగరేణి వార్షిక లాభాల్లో పర్మనెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల బోనస్ ప్రకటించారని, అయితే గత సంవత్సరం రూ.5000 ప్రకటించి, ఈ ఏడాది రూ.5500 మాత్రమే ప్రకటించడం పట్ల కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకొని కాంట్రాక్ట్ కార్మికులకు రూ.10 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మికులు శంకర్, నాగమ్మ, మల్లేష్, లోకేష్, సురేష్, తార, రోజా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలగానే కమర్షియల్ కాంప్లెక్స్‌లు

- ప్రకటనలకే పరిమితమైన సింగరేణి సంస్థ
- నిర్మిస్తే అభివృద్ధితో పాటుగా ఉపాధి
- ఉన్న షాపులకు అద్దెలు వసూలు కాని పరిస్థితి



కొత్తగూడెం సూపర్‌బజార్‌లోని సింగరేణి సంస్థ షాపులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యి నాలుగు నెలలు గడుస్తోంది. కానీ ఇంతవరకు చెప్పుకోదగిన అభివృద్ధి పని ఒక్కటి కూడా జరగలేదు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌లోని డివిజన్లలో పలు సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సుజాతనగర్ డివిజన్‌లో ప్రధానంగా వీధిలైట్లు, రోడ్లు సరిగాలేక అవస్థలు పడుతున్నారు. దీంతో పాటుగా కొత్తగూడెం, పాల్వంచలలో కూడా వర్షం వస్తే ప్రధాన రోడ్లు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు చిన్న సమస్యలను కూడా పరిష్కరించ లేని స్థితిలో ఉన్నారు. అయితే కార్పొరేషన్‌లో సింగరేణి స్థలాలతో పాటుగా, ప్రభుత్వ స్థలాలు కూడా చాలా ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలలో గతంలో తహసీల్దారు కార్యాలయం వారు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఆయా బోర్డులను ప్రస్తుతం కొంతమంది భూ కబ్జాదారులు తొలగించి భూమిని చదును చేసి ప్లాట్లుగా అమ్ముతున్నారు. అయినా అధికారులు, రాజకీయ నాయకుల ఒత్తిడితో ఏమీ చేయలేని పరిస్థితి. ఇక సింగరేణి స్థలాలు కూడా అనేకం ఉన్నాయి. 2016లోనే లీజు అయిపోవడంతో కార్పొరేషన్‌కు అప్పగించామని సింగరేణి అధికారులు చెబుతున్నారు. కార్పొరేషన్ అయిన తరువాత సింగరేణి స్థలాలు ఎన్ని ఉన్నాయి, ప్రభుత్వ స్థలాలు ఎన్ని ఉన్నాయి, అనే అధికారిక సర్వే ఒక్కటి కూడా ఇంత వరకు జరగలేదు.

కాంప్లెక్స్‌ల నిర్మాణం జరిగేనా?

కొత్తగూడెం నగరం సూపర్‌బజార్ సెంటర్, ఖమ్మం వెళ్లే రోడ్డులో 40 సింగరేణి షాపులున్నాయి. దశాబ్దాల క్రితం సింగరేణి సంస్థ వాటిని అద్దెకు ఇచ్చింది. దశాబ్దాల క్రితం ఎవరైతే వాటిని అద్దెకు తీసుకున్నారో వారు, వారి కుటుంబ సభ్యులు మాత్రమే వాటిని నడుపుతున్నారు. తక్కువ అద్దెలతో రూ.లక్షల వ్యాపారులు చేస్తున్నారు. అయితే సింగరేణి మాజీ కార్మికుల కుటుంబాలకు గానీ, నిరుద్యోగులకు గానీ అవకాశం కల్పించకుండా ఏళ్ల తరబడిగా లబ్ధి పొందుతున్నారు. సింగరేణి అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆ 40 షాపులకు టెండర్లు పిలిచి వేలంపాట నిర్వహించి అద్దెలు పెంచితే సింగరేణి లాభంతో పాటుగా కొత్తవారికి అవకాశం ఉంటుంది. అయితే సింగరేణి షాపుల అద్దెలు కూడా రూ.లక్షల్లో బకాయిలున్నాయి. వాటిని వసూలు చేసే సాహసం గానీ, వసూళ్లు ఎంత ఉన్నాయో కూడా చెప్పే సాహసం ఎస్టేట్ అధికారులు చేయడం లేదు. అధికారులు ఎవరిని కాపాడేందుకు సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారో తెలియని పరిస్థితి సింగరేణిలో ఉంది. బకాయిలు వసూలు చేస్తే సింగరేణి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. కానీ అద్దెలు వసూలు చేయడం కానీ, నోటీసులు జారీ చేయడం కాని ఎందుకు చేయడం లేదో భేతాళ ప్రశ్న.

ప్రకటనలపై పట్టింపు లేదు.. కొత్తగూడెంలో ప్రస్తుతం 40 షాపులు ఉన్న ప్రాంతం, దాని వెనుక భాగంలో సింగరేణి స్థలాలు అనేకం ఉన్నాయి. ఆ స్థలాల్లో సింగరేణి కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మాణం చేపడతామని అధికారులు గత ఏడాది ప్రకటనలు చేశారు. అయితే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కొరకు ఎంత భూమి అవసరం పడుతుంది, ఏ విధంగా నిర్మాణం చేపట్టాలనే దానిపై అధికారులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. కొత్తగూడెంలోని సింగరేణి స్థలాలలో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని నగర ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే సింగరేణి ఆధ్వర్యంలో నిర్మాణం చేపడితే ఆ ఆదాయం అంతా సింగరేణికే వెళ్తుంది.

నగరంలో కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలోనే నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. దీని వలన నగరంలో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం విషయంలో సింగరేణి వారు ముందుకు కదలడం లేదు, కార్పొరేషన్ అధికారులు అసలు చర్యలు తీసుకోవడం లేదు. దీని వలన నగరంలో అభివృద్ధి పనులు పెండింగ్ పడుతున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈ దసరాకైనా బోనస్ ఇచ్చేనా !

పాల్వంచ: టీఎస్ జెన్కోలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు కొన్ని సంవత్సరాలుగా బోనస్ ఇచ్చే ఆనవాయితీ నిలిచిపోయింది. సింగరేణి, ఆర్టీసీ వంటి సంస్థల్లో ప్రతీ ఏటా దసరాకు లాభాల బోనస్‌ను ఇస్తుండగా జెన్కో సంస్థలో మాత్రం దీనిని నిలిపివేశారు. 2017 నుంచి ఇవ్వకపోవడంతో ఉద్యోగ, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో కీలక భూమిక పోషిస్తున్న శాఖ జెన్కో సంస్థ. ప్రజలకు, రైతులకు ఉచిత విద్యుత్ పథకాలు అందించడంలో జెన్కోది కీలకపాత్ర. విద్యుత్ ఉత్పాదనలో మూడు షిఫ్టులు, జనరల్ మెయింటెనెన్స్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం జెన్కో సీఎండీ వినతిపత్రం అందించారు.

పీవైఎల్ రాజకీయ శిక్షణ తరగతులు

టేకులపల్లి: 25, 26 తేదీలలో సూర్యాపేట జిల్లా కోదాడలో జరిగే ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ పిలుపునిచ్చారు. బుధవారం టేకులపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత చెడు మార్గంలో పయనిస్తున్నారన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలతో ప్రజలపై నిర్బంధం కొనసాగిస్తోందని విమర్శించారు. వీటిని యువత అధ్యయనం చేయాలని చెప్పారు. యువతీ యువకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు


సంపత్‌నగర్ వద్ద ఇసుకను పరిశీలిస్తున్న పోలీసులు

టేకులపల్లి: అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ పోలిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు టేకులపల్లి మండలం సంపత్‌నగర్ సమీపంలోని వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి సీఐ, ఎస్ఐలు సంపత్‌నగర్ వాగుని సందర్శించారు. మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చట్ట విరుద్ధమని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, సంబంధితవారిపై కేసులు నమోదు చేయడముతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే అనుమతి ఉంటుందని సంబంధిత అధికారి టోకెన్ల ద్వారానే ఇసుక రవాణా జరుగుతుందని చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు టేకులపల్లి మండలం బోడు ఎస్ఐ పోలిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమ్‌లు, గుట్కాలు, పాన్ మసాలాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మాయమాటలు నమ్మి, ఈజీ మనీ మోజులో మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నంబర్లు, ఓటీపీ వివరాలు ఎవరికీ చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయాలని తెలిపారు. వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడి

ఇల్లెందు: సింగరేణి కార్మికుల లాభాల వాటాలో కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు బి.మధు(సీఐటీయూ), యాకుబ్ షావలీ (టీయూసీఐ), సతీష్ (ఇఫ్టూ), రాంసింగ్ (ఇఫ్టూ) ఆరోపించారు. బుధవారం ఇల్లెందులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.500 మాత్రమే పెంచి తీవ్ర అన్యాయం చేసినా కోల్ బెల్టు ప్రాంతంలోని ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, తాళ్లూరి కృష్ణ, రఘు, తరుణ్, లింగమూర్తి, ఉపేందర్, వెంకటబ్బాయి, మధు, సుమిత్ర, జమున, గంగ, రాజేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మధు

లాభాల వాటాలో కార్మికులకు అన్యాయం


మాట్లాడుతున్న సారయ్య

టేకులపల్లి: సింగరేణి లాభాల వాటాలో కార్మికులకు అన్యాయం జరిగిందని ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి కె.సారయ్య, ఇల్లెందు బ్రాంచి కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు బుధవారం కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఏర్పాటు చేసిన పిట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సింగరేణి కార్మికులు ఆశించిన మేరకు లాభాల వాటాను పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సీఎండీతో జరిగిన స్ట్రక్చరల్ మీటింగ్‌లో ఒప్పందం చేసుకున్న సొంతింటి పథకం, పెరక్స్ మీద ఇన్‌కమ్ టాక్స్, వడ్డీ లేని రుణం, మారు పేర్లు ఇలా అనేక విషయాలు గురించి చర్చించిన విషయాలను కార్మికులకు తెలియజేశారు. ఈ పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి రాజారాం, సుందర్, కొంగర వెంకటేశ్వర్లు, సర్వర్, సామల శ్రీనివాస్, కరుణ శంకర్, అజ్మీర కిషోర్, శ్రీనివాస్, దళ్‌సింగ్, అయ్యోరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పాల్వంచ: అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నవభారత్ ఏరియాలోని పలు కాలనీల్లో సీపీఎం ఆధ్వర్యంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపులు వేసి ఏళ్లు గడుస్తున్నా నేటికి మంచినీటి కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాల్లో చిత్తశుద్ధి లేదన్నారు. పాల్వంచలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేసేంత వరకు పోరాటాలు సాగిస్తామన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, పెన్షన్ల ఆన్‌లైన్ వెబ్‌సైట్ ప్రభుత్వం ఓపెన్ చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు కొత్త పెన్షన్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, పాదిల తులసీరామ్, కాంతి, ఇందిర, పద్మ, అపర్ణ, అలీమా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం


పాపకొల్లు బీటీ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు: వైరా నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలో ఎమ్మెల్యే పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. జూలూరుపాడు నుంచి పాపకొల్లు వరకు బీటీ రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సురారం, కొత్తూరు, గుండ్లరేవు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలు, లక్షలతో వినోభానగర్, రామచంద్రాపురం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను రాందాస్ నాయక్ ప్రారంభించారు. జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు రూ.5.41 లక్షలు విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికి ఇళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి మొదటి విడతలో వైరా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, లేళ్ల వెంకటరెడ్డి, నాగా సీతారాములు, మాలోత్ మంగీలాల్ నాయక్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, తహసీల్దార్ టి.శ్రీనివాస్, ఎంపీఓ తులసీరామ్, ఎస్ఐ బాదావత్ రవి, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ కార్తీక్ రెడ్డి, కాంట్రాక్టర్ గొల్లపూడి శ్యామ్‌సుందర్‌రావు, వేల్పుల నరసింహారావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, రాంశెట్టి రాంబాబు, లకావత్ లచ్చు నాయక్, మాళోత్ విష్ణుష్, ధరావత్ రాంబాబు, మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, దుద్దుకూరి సుమంత్, బానోత్ బాబు, కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం, లేళ్ల గోపాల్‌రెడ్డి, బానోత్ శాంతిలాల్, గుగులోత్ రాందాస్, చింతా జగన్నాథం, హాతీరామ్, ప్రియాంక పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకుందాం..


అటవీ విత్తనాలు పరిశీలిస్తున్న బాబూరావు

ఇల్లెందు: అంతరించి పోతున్న ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు కోరారు. బుధవారం ఇల్లెందులోని సాహితీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. భాషాభివృద్ధికి, చట్టాల అమలుకు ప్రతీ ఆదివాసీ పోరాడాలని పిలుపునిచ్చారు. ఏళ్లు గడుస్తున్నా ఆదివాసీలు అభివృద్ధి చెందటం లేదన్నారు. ఆదివాసీలు ప్రమాద అంచున పయనిస్తున్నారని, పాలకుల వైఖరిని నిరసిస్తూ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోయత్తూర్ బాష బడి లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడవిపై ఆధారపడి సేకరించే అటవీ ఉత్పత్తులు, 150 రకాల అటవీ విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించారు. సీపీఎం గిరిజన సంఘం నాయకులు దుగ్గి కృష్ణ, కారం పుల్లయ్య, వజ్జా సురేష్, కారం పుల్లయ్య, కొడెం బోస్, ఈసం నరసింహారావు, కుంజ రమేష్, ఎట్టి రాములు, మూతి రాజశేఖర్, భవానీ పాల్గొన్నారు.

డైలీవేజ్ వర్కర్ల సమ్మెకు మద్దతు..

13 రోజులుగా సమ్మె చేస్తున్న డైలీవేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమ్మెకు సీపీఎం మాజీ ఎంపీ మిడియం బాబూరావు సంఘీభావం తెలిపారు. బుధవారం ఇల్లెందులోని మొయిన్ రోడ్ హైస్కూల్ ఎదుట చేపట్టిన ఆందోళన నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీబావం తెలిపారు. అనంతరం డైలీవేజ్ వర్కర్లతో కలిసి బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఆయన వెంట సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, దుగ్గి కృష్ణ, ఎస్ఏ నబీ, వజ్జా సురేష్, కొడెం బోస్, కృష్ణ, భద్రయ్య, ముత్తయ్య, నాగేశ్వరరావు, స్వామి, మంగ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదికర్మ యోగి అభియాన్‌పై అవగాహన

సుజాతనగర్: ఆదికర్మ యోగి అభియాన్‌పై సర్వారం గ్రామంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీం లీడర్ కబీర్ మాట్లాడుతూ ఆదికర్మ యోగి అభియాన్‌లో గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఐదేళ్ల ప్రణాళికపై సమగ్ర నివేదికలు తయారు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామ విజన్–2030 లక్ష్యంతో ప్రజలు, అధికారుల భాగస్వామ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కోసం మండలంలో సీతంపేట, సర్వారం, సింగభూపాలెం మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు, అమలుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు రాంప్రసాద్, శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి..

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై సంపూర్ణ అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి సూచించారు. కొమరారం గ్రామంలో ఆదికర్మ యోగి పథకంలో భాగంగా బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాలు తమ పరిధిలో ఎలా అమలవుతున్నాయో సరిచూసుకోవాలన్నారు. గ్రామ అవసరాలను అధ్యనం చేసి ఆయా పథకాల ద్వారా మంజూరుకు గ్రామసభ తీర్మానాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యదర్శి కిరణ్, సెర్ప్ సీసీ సంపత్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి

సేవా ధృక్పథాన్ని అలవరచ్చుకోవాలి

పాల్వంచరూరల్: విద్యార్థులు సేవా ధృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పసుపులేటి శంకర్ అన్నారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు మోక్షం కలిగేనా?

- శంకుస్థాపన చేసి మూడేళ్లు
- ఇబ్బందులు పడుతున్న ఆదివాసీ, గిరిజనులు


సాయనపేట రోడ్డు


తుమ్మలచెలక రోడ్డు

టేకులపల్లి: తొమ్మిదోమైలు తండా సాయనపేట, బద్దు తండా పంచాయతీ తుమ్మలచెలక బీటీ రోడ్లకు మోక్షం కలగడం లేదు. శంకుస్థాపన చేసి మూడేళ్లు అవుతున్నా రోడ్డు నిర్మాణ పనులు మాత్రం పూర్తిలేదు. దశాబ్దాలుగా రెండు గ్రామాల ప్రజలు పక్కా రోడ్డు కోసం ఎదురు చూస్తున్నారు. ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి సాయనపేట వరకు ఎస్టీఎస్‌డీఎఫ్ 2022–23 నిధులు రూ.70లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2023లో అప్పటి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభం అయ్యాయి. కంకర మిక్సింగ్ కూడా పరిచారు. రెండు కల్వర్టులు నిర్మించారు. ఈలోగా అటవీ అధికారులు ఇది రిజర్వు ఫారెస్టు భూమి.. రోడ్డు నిర్మాణం చేయొద్దని పనులను నిలిపివేశారు. దీంతో ఆనాడు నిలిచిన పనులు నేటికీ ప్రారంభం కాలేదు. అదే విధంగా బద్దు తండా పంచాయతీ తుమ్మలచెలక స్టేజీ నుంచి తుమ్మలచెలక గ్రామానికి ఎస్టీఎస్‌డీఎఫ్ రూ.17 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2023లో అప్పటి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శంకుస్థాపన చేశారు.

పనులు కూడా ప్రారంభం అయ్యాయి. అకస్మాత్తుగా కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను నిలిపివేశాడు. సాయనపేట, తుమ్మలచెలక రెండు బీటీ రోడ్లను చేస్తున్నది ఒక్కరే కాంట్రాక్టర్ కావడం, రెండు పనులు ఒకేసారి చేయడం వల్ల యంత్రాల పరంగా, మెటీరియల్ కలిసివస్తుందని సాయనపేట రోడ్డుకు ఫారెస్టు క్లియరెన్స్ వచ్చాక రెండూ కలిపి ఒకేసారి ప్రారంభించాలని కాంట్రాక్టర్ భావిస్తున్నట్లు సమాచారం.

సాయనపేట రోడ్డు నిర్మాణం ఫారెస్టు అడ్డంకుల వల్ల నిలిచిపోవడంతో కాంట్రాక్టర్ తుమ్మలచెలక రోడ్డు పనులను కూడా నిలిపివేశారు. మూడేళ్లుగా ఈ రెండు గ్రామాల ఆదివాసీ, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే రోడ్లు బురదమయం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సాయనపేట, తుమ్మలచెలక బీటీ రోడ్లు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి..



2023లో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మాకు పక్కా రోడ్డు వచ్చింది కదా అని అందరం సంబర పడ్డాం. సాయనపేటలలో రోడ్డు పనులు నిలిచిపోవడంతో తుమ్మలచెలక రోడ్డు పనులను కూడా నిలిపివేశారు. వేరే రోడ్డుతో లింక్ పెట్టి మా రోడ్డు పనులు చేయకపోవడం సరైంది కాదు.

– ఊకే రామకృష్ణ, తుమ్మలచెలక

అడ్డంకులు తొలగించాలి..



దశాబ్దాలుగా పక్కా రోడ్డు లేదు. 2023లో బీటీ రోడ్డు మంజూరైంది. చాలా సంతోషించాం. రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డుని తవ్వి కంకర మిక్సింగ్ కూడా వేశారు. అటవీ అధికారులు అభ్యంతరం తెలపడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకుని రోడ్డు పనులు పూర్తి చేయించాలి.

– తోలెం ముత్తయ్య, సాయనపేట